విగ్రహం ఇచ్చిన క్లూ

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"విరాళ ఉత్తరం వచ్చింది" అంది రజని.

శ్రీకాంత్ అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు.

"ఎక్కడినుండో చూడు" అన్నాడు శ్రీకాంత్.

రజని కవర్ మీది పోస్టలు స్టాంపును పరిశీలించింది.

"వాల్తేర్ ఆర్. ఎం. ఎస్."

"వాల్తేరు నుండా? అంటే విశాఖపట్నం సిటీ నుండన్నమాట! అక్కడ మనకు ఉత్తరం రాసేవాళ్ళు" శ్రీకాంత్ ఆభినయంలో వున్నాడు.

చర్ చర్ ర్ ర్ మని శబ్దమయింది. రజని కవరు చింపింది. తెల్లటి పాల రంగులో వున్న కాగితం బయట పడింది.

"వూఁ! మీ వూహా చాలు! చదవండి!" మడిచివున్న కాగితం అందించింది.

దువ్వెన డ్రెస్సింగ్ టేబులుమీద పెట్టాడు శ్రీకాంత్. ఉత్తరం అందుకున్నాడు. అలవోకగా మడత విప్పాడు.

ఉత్తరం లెటర్ పేడ్ మీద రాసినది.

“చదువుతాను విను” అన్నాడు శ్రీకాంత్.

వి. శోభనాద్రి,
డోర్ నెంబర్ 20బి—16/2,
అమర్ నగర్, విశాఖపట్నం—16.

ప్రియమైన మేనల్లుడు శ్రీకాంత్!

శుభాకాంక్షలు. త్వరలో నీకు పుట్టిన రోజు వస్తోంది. ఏ నీడా నీమీద సోకదు. పుట్టిన రోజు క్షణాలలో నీకు అదృష్టం కలిసి వస్తుంది. నయనానందకరమైన వాతావరణం. పెద్దమనిషిని కలుసుకో. ఈ రోజుల్లో డబ్బు వున్నవాడే పెద్ద మనిషి! నీ అదృష్టం కూడా డబ్బుతో ముడిపడి వుంది.

శుభాకాంక్షలతో—
నీ మేనమామ,
శోభనాద్రి.

ఉత్తరం చదవడం ముగించి ఈలవేయబోయాడు శ్రీకాంత్. ఉత్తరం కొరుకుడు పడలేదు. రెండోసారి చదువుతున్నాడు.

“ఎవరండీ ఈ మేనమామ!” అడిగింది రజని.

“యెవరో గుర్తుకు రావడంలేదు.”

“ఉత్తరంలో తలాతోకాలేని విషయాలేమిటి?”

“అదే చూస్తున్నాను. అసలు అర్థంకావడంలేదు.”

“చింపి అవతల పారవేద్దురూ.”

శ్రీకాంత్ ఆమె మాటలు వినడంలేదు. అతడి మస్తిష్కం పనిచేస్తోంది. ఈ ఉత్తరం పనీపాటా లేనివాడు రాసిందా! కాదు. అలా అయివుంటే డోర్

నెంబర్‌తో సహా యెందుకు యిస్తాడు? ఒకవేళ ఈ ఉత్తరం తనని వుద్దేశించి కాదా?

"కవర్ ఏది?" అడిగాడు శ్రీకాంత్.

రజని వంగి కవర్ అందించింది. మామూలు తెల్లటి కవర్, పోస్టల్ స్టాంప్ అంటించి వుంది. అడ్రసు స్పష్టంగా టైప్ చేసివుంది.

చిరునామా తనదే. ఈ వుత్తరం తనకే అని స్పష్టమయింది.

ఉత్తరం వెనక్కి త్రిప్పాడు.

'కె. రాఘవులు,
సివిల్ లాయర్,
సరస్వతీ జంక్షన్,
విశాఖపట్నం' అని వుంది.

"రజనీ! సీరియస్‌గా ఆలోచించు."

"ఏమిటండీ? అర్థం పర్థంలేని వుత్తరం పట్టుకుని...."

"అడ్రసులు యింత ఖచ్చితంగా సరిపోలవు."

"డబ్బు అనేటప్పటికి మీకు మతిపోయింది!"

శ్రీకాంత్ మాట్లాడలేదు. రజని తనకు ఫక్తు వ్యతిరేకం! తాను తేలికగా తీసుకునే విషయాలకు ఆమె విపరీతమైన ప్రాముఖ్యత యిస్తుంది. తాను సీరియస్‌గా తీసుకుంటే ఆమె తేల్చిపారవేస్తుంది.

శ్రీకాంత్ కవరూ కాగితమూ మడిచి జేబులో పెట్టుకున్నాడు. చకచక మూల గదిలోకి నడిచాడు. పనికిమాలిన వస్తువులు ప్రోగుపడి వున్నాయి. తలుపులు తీయగానే బొద్దింకలు పరుగెత్తాయి. ఎలుకలు కిటికీవైపు దూకాయి. గదిలో గబ్బు కంపు.

పనికిమాలిన వస్తువులను కెలుకుతున్నాడు శ్రీకాంత్.

"జాగ్రత్త! తేళ్ళుంటాయి!" అరుస్తోంది రజని.

శ్రీకాంత్ పాతకాలంనాటి రేకుపెట్టె తీశాడు. రేకులు తుప్పుపట్టి విరిగి వున్నాయి.

రేకుపెట్టెను వరండాలోకి లాగాడు శ్రీకాంత్. గాలిలో దుమ్ము రేగింది.

శ్రీకాంత్ ఊపిరి బిగబెట్టాడు. పెట్టెమూత లాగాడు. పనికిమాలిని పుస్తకాలున్నాయి. వాటిమీద చిమ్మెట్లు తిరుగుతున్నాయి.

"అవెందుకండీ? ఏనాటివో అవి....పనికిమాలిన...."

శ్రీకాంత్ కాగితాలు కెలుకుతున్నాడు. నల్లటి అట్టలు వేసిన డైరీలు బయటపడ్డాయి. కాలం వాటి నలుపు రంగును తినేస్తోంది. డైరీలు దులిపాడు. కీటకాలు పరుగెత్తాయి.

డైరీలు వెతకసాగాడు. తండ్రి రాసిన డైరీలు.

2

శ్రీకాంత్ తనకి వచ్చిన వుత్తరమూ, కవరూ చూపించాడు లాయరుకు.

"ఓ! శోభనాద్రిగారి మేనల్లుడు మీరా?" కావాలని ఆశ్చర్యపోయాడు రాఘవులు.

"ఈ ఉత్తరం నాకు అసలు అర్థంకాలేదండి. మీరు చెబుతారేమో!" అన్నాడు శ్రీకాంత్.

రాఘవులు పెళ పెళ నవ్వాడు.

"శోభనాద్రిగారు వింత మనిషి! అందుకే ఆయన చివరి క్షణాలు నాలాంటి పరాయివాడి చేతిమీద వెళ్ళిపోయాయి!" పొడి కళ్ళు అద్దుకున్నాడు.

"శోభనాద్రిగారు మీకు ఉత్తరం విషయం చెప్పివుంటారు" కలగజేసుకున్నాడు వామనమూర్తి. అతను

శ్రీకాంత్ కు బాబాయి.

"నాకు చెప్పేలాగా వుంటే అంత తిరకాసుగా ఎందుకు రాస్తారు? ఆ రహస్యం శ్రీకాంత్ కి తెలియాలనే అలా రాయించివుంటారు."

"శోభనాద్రిగారి ఆస్తి ఏమాత్రం వుంటుంది?"

"ఆస్తా? నాకు తెలియదు."

"అదేమిటి? ఆయన సివిల్ వ్యవహారాలు మీరే చక్కబెడతారు!"

"సివిల్! అంతే! ఆర్థిక వ్యవహారాలు కాదు గదా!" మరల పెళ పెళ నవ్వబోయాడు రాఘవులు.

"పోనీ, అమర్ నగర్ లో శోభనాద్రి బంగళా గురించి చెప్పండి."

రాఘవులు నవ్వడం ఆపలేకపోయాడు. పెళ పెళ నవ్వాడు.

"అలా అడగండి చెబుతాను. నగరాభివృద్ధి సంస్థకి దాన్ని అమ్మేశారు."

శ్రీకాంత్ తన తలమీద పిడుగుపడినట్టు తబ్బిబ్బు పడ్డాడు.

"ఎందుకు?"

"చుట్టుపక్కల రెండెకరాల స్థలం. యెందుకా? నగరాభివృద్ధి కోసం." రాఘవులు పెళ పెళ నవ్వాడు.

"మామయ్య ఆ డబ్బు ఏం చేసి వుంటాడు?"

"పరమాత్ముడికి తెలియాలి!"

వామనమూర్తి శ్రీకాంత్ మొహాలు చూసుకున్నారు.

"మామయ్య ఒంటరిగానే వుండేవాడా?"

"పోయిన డిశెంబర్ నెలాఖరువరకూ."

"ఆయనతో ఎవరుండేవారు?"

"నర్సమ్మ."

"ఆమె ఎవరు?"

"నర్స్ అండీ బాబూ! నర్స్ — సపర్యలు చేయడానికి."

"ఆమె ఒక్కతేనా?"

"ఆమె భర్తతోబాటు ఆ యింట్లోనే మకాం!"

రాఘవుల కళ్ళ కొసలు వంగుతోన్నాయి.

"నర్స్ పేరేమిటి?"

"అప్పల నరసమ్మ. ఫస్టు నేటివ్ అమ్మడు. ఆమె భర్త పైడితల్లి."

"వాళ్ళు ఎందుకు వెళ్ళిపోయారు?"

"అప్పల నరసమ్మ పేరుకే అలా వుందిగాని దోర ముగ్గిన జాంపండు అమ్మడు. శోభనాద్రి మీద మనసు పడిందట. పైడితల్లి ఆమెను లాక్కుపోయాడు."

"డెబ్బై రెండు సంవత్సరాల గుండె జబ్బు ముసలాడికి వలపా?"

రాఘవులు పెళ పెళ నవ్వి, "అమ్మడికే అతడిమీద వలపు రేగిందని నా నమ్మకం!" అన్నాడు.

"అదయినా ఎలా?—ఓ....ఆ స్తిని చూశా?"

శ్రీకాంత్ కి చిరాకుగా వుంది. ఈ రాఘవులు సగ్గు జావాలాగా మంచదు తేల్చడు. జిడ్డు వ్యవహారం.

"వాళ్ళ అడ్రసులు తెలుసా?"

"ఆమె యిక్కడే ఏదో ఆసుపత్రిలో చేరిందని విన్నాను."

"ప్లీజ్ చెబుతారా?"

రాఘవులు అశగా చూశాడు.

వామనమూర్తి సైగ చేశాడు. శ్రీకాంత్ అతడికి

యాభైనోటు అందించాడు. రాఘవులు చప్పున అందు కున్నాడు.

"తెలుసుకుని ఈ సాయంత్రం చెబుతాను" అన్నాడు రాఘవులు.

"ఆ మాట ముందే ఏడవ్వొచ్చు కదా!' నోటి చివర వరకూ వచ్చింది. కాని శ్రీకాంత్ వూరుకున్నాడు.

రాఘవులు లేచాడు. "ఇక మీరు నాకు సెలవు యిప్పించండి!" అన్నాడు. వామనమూర్తి శ్రీకాంత్ రోడ్డుమీద వున్నాడు.

"ఎవడు పడితే వాడి దగ్గర మనం దోపిడీ అవుతాం. డిటెక్టివ్ శిరీష్‌ను పట్టుకుందాం. వ్యవహారం అంతా ఆయనే చూసుకుంటాడు."

ఇద్దరూ ఆటో ఎక్కారు.

డిటెక్టివ్ శిరీష్ యింట్లోనే వున్నాడు.

ఇద్దరూ విషయం చెప్పారు. లెటరు, కవరు లాయరు గారి దగ్గరనే వున్నట్లు చెప్పారు.

శిరీష్ కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు.

"మనం ముగ్గురమూ మళ్ళీ రాఘవులు యింటికి వెళ్ళాలి!" అన్నాడు శిరీష్.

3

కొత్త డాట్సన్ కారు సరస్వతీ జంక్షన్‌లో ఆగింది. శిరీష్ కారును ఒక ప్రక్కగా పార్క్ చేశాడు. శ్రీకాంత్, వామనమూర్తి కారు దిగారు.

ముగ్గురూ రాఘవులి యింటిముందుకు నడిచారు.

రాఘవులు ముందు హాలులో లేడు. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. ముందు హాలులో కోటు హేంగర్‌కి వ్రేలాడు తోంది. నల్ల కోటు!

"కోర్టుకి యింకా వెళ్ళలేదు!" అన్నాడు శిరీష్.

వామనమూర్తి తలూపాడు. మెయిన్ హాలులోంచి ప్రక్క గదిలోకి వెళ్ళే గుమ్మం మూసివుంది. పేరుపెట్టి పిలిచినా జవాబు రాలేదు.

శిరీష్ మెల్లగా తలుపు తోశాడు. పెద్ద గది. ఆ గదిలో ఎవరూ లేరు.

శిరీష్ గదిలోకి ప్రవేశించాడు. వామనమూర్తి, శ్రీకాంత్ అతడిని అనుసరించారు.

ఆ గదిలోంచి ప్రక్క గదికి వెళ్ళే గుమ్మం వుంది. దాని తలుపులు దగ్గరగా వేసివున్నాయి.

ఎక్కడినుండో మూలుగు వినిపిస్తోంది. ఎవరో బాధాకరంగా మూలుగుతున్నారు. శిరీష్ చటుక్కున ప్రక్క గది తలుపులు నెట్టాడు. బిగుసుకుపోయిన తలుపులకు లాగా అతికష్టంమీద లోపలకు తెరచుకున్నాయి.

చిన్న గది. ఒక మూలగా టేబులూ, టేబులుకి ఇవతల తిరగబడిన కుర్చీ, గోడకి చేర్చి పుస్తకాల రాక్, తిరగబడిన కుర్చీకీ రాక్‌కీ మధ్య నేలమీద వెల్లకితల పడిన వ్యక్తి.

గోడమీద స్విచ్ తడిమి లైటు వేశాడు శిరీష్.

వామనమూర్తి, శ్రీకాంత్ గదిలోకి ప్రవేశించారు.

"అరరె! ప్లీడర్ గారు!" అన్నాడు శ్రీకాంత్.

తిరగబడిన కుర్చీని సరియైన స్థితిలో వుంచాడు శిరీష్.

రాఘవులు వెల్లకితలా పడివున్నాడు. అతడి చేతిలో మూత తీసిన కలం వుంది. అతడికి కొద్ది దూరంలో కాగితాలు పడివున్నాయి. రాఘవులు కళ్ళు మూసుకుని వగరుస్తున్నాడు.

"రాఘవులుగారూ!" పిలిచాడు వామనమూర్తి.

రాఘవులు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

"మీరా? వాళ్ళనుకున్నాను" అన్నాడు.

"వాళ్ళా? వాళ్ళెవరు?"

"ఏమో తెలియదు. ముగ్గురు గుండాలు. ఈ గదిలో కూర్చుండి నేను రాసుకుంటున్నాను" రాఘవులు చుట్టూ చూశాడు. శిరీష్ చటుక్కున అతడికి కలం మాత్ర అందించాడు. రాఘవులు అందుకున్నాడు.

మీ రెవరన్నట్టు చూశాడు.

"శ్రీకాంత్ నాకు ఫ్రెండులెండి. దారిలో ఎదు రయ్యాం!" అన్నాడు శిరీష్.

"నన్ను కుర్చీలోంచి క్రిందకులాగారు. కాగితాలు విసిరికొట్టారు. ఒకడు నా గొంతువద్ద కత్తి వుంచాడు."

"వాళ్ళు యింతకుముందు తెలుసా?"

"తెలియదు. మరల చూచినా గుర్తుపట్టలేను. కాని వారి ముగ్గురిలో ఒకడి పేరు మాత్రం ఠాకూర్ అని తెలిసింది."

"వాళ్ళు ఏం కావాలన్నారు?"

"శ్రీకాంత్ కి వాళ్ళ మేనమామ పంపిన వుత్తరం!"

"అంతేనా" కళ్ళెగరేశాడు శిరీష్.

"అదేం బాబూ! ఆ ఉత్తరంలో ఏదో రహస్య నిధి వుందేమో!"

"వాళ్ళు ఉత్తరం రాసుకుని వెళ్ళిపోయారా?"

"ఒట్టినే వెళ్ళిపోయారా? వాళ్ళ కార్యకలాపాలలో జోక్యం పెట్టుకోవద్దన్నారు."

"పెట్టుకుంటే!"

"పీక తీసేస్తామన్నారు" రాఘవులు చెమటలు కక్కాడు.

"శోభనాద్రిగారు తన మేనల్లుడికి వుత్తరం పంపినట్టు వాళ్ళకు ఎలా తెలిసింది?" అడిగాడు శిరీష్.

రాఘవులు పరీక్షగా చూచి, "మీ రెవరో డిటెక్టివ్ లాగా వున్నారు. వాళ్ళకు ఎలా తెలిసిందో మాకు ఎలా తెలుస్తుంది?" అన్నాడు.

"బాంక్ ఎక్కౌంట్ తన మేనల్లుడికి యివ్వాలనుకున్నారు శోభనాద్రిగారు. అర్థంకాని ఉత్తరం రాసి పెట్టారు. మేనల్లుడికి డబ్బు యివ్వకుండా అడ్డుపడే శక్తి యెవరికి వుంది?"

"ఆయన వ్యక్తిగత రహస్యాలు ఎలా తెలుస్తాయి?"

"మీరు తప్పించి మీ యింట్లో ఎవరూ లేరా?"

"లేరు బాబూ! మా ఆవిడ అలిగి పుట్టింటికి వెళ్ళింది!"

"అవును మరి, నువ్వు సగ్గు జావవి!" గొణుక్కున్నాడు వామనమూర్తి.

"వాళ్ళు మరల వస్తారేమో!" అడిగాడు శిరీష్ తిరిగి.

"రారనుకుంటాను. కావలసింది తీసుకున్నారు కదా!"

"శోభనాద్రిగారి బంగళాను నగరాభివృద్ధి సంస్థకు యిచ్చేశారా?"

"అవును. ఒక వారం రోజులలో బంగళా పడగొట్టి రెండెకరాల భూమీ చదును చేస్తారు. ప్లాట్లు వేసి అమ్మేస్తారు."

శిరీష్ తలపంకించి గదిలోంచి బయటకు నడిచాడు. రాఘవులు శ్రీకాంత్ కు లెటరు తిరిగి ఇచ్చేసాడు.

శ్రీకాంత్ మెల్లగా రాఘవులును కుర్చీలో కూర్చుండబెట్టాడు. వామనమూర్తితో కలిసి బయటకు నడిచాడు.

"శోభనాద్రి బంగళా తాళం చెవులు అడుగు!" అన్నాడు శ్రీకాంత్ అతడితో.

4

అమర్ నగర్‌లో ప్రవేశించింది కారు. విశాలమైన బంగళా ముందు ఆగింది కారు. కారులోంచి డిటెక్టివ్ శిరీష్ దిగాడు. వెనక సీట్లోంచి వామనమూర్తి శ్రీకాంత్ దిగారు.

బంగళా గేటు తెరిచాడు శ్రీకాంత్. వామనమూర్తి, శిరీష్, శ్రీకాంత్ బంగళా మెట్లు ఎక్కారు. శిరీష్ తాళాలు తెరిచాడు.

బంగళా బోసిగా వుంది. రెండెకరాల ఖాళీస్థలంలో కట్టిన బంగళా, బంగళా చుట్టూ స్థలంలో రకరకాల తోటలు పెరుగుతున్నాయి. తోట దృశ్యం చాలావరకూ బంగళా కిటికీల్లోంచి కనిపిస్తోంది.

శిరీష్ అన్ని గదులూ తిరిగాడు. ఒక గదిలో ఆగి పోయాడు. ఆ గది బెడ్‌రూం. గదికి రెండు పెద్ద కిటికీలున్నాయి. కిటికీలలోంచి తోటలో పూలు కనిపిస్తున్నాయి. వాటికి బాక్‌గ్రౌండులో సర్వీ తోటవుంది. ఎండ పూలమీద ప్రతిఫలిస్తోంది. దృశ్యం మనోజ్ఞంగా వుంది.

గది గోడమీద చిత్రపటం తగిలించి వుంది. కాశ్మీర్ ప్రాంతంలో లాండ్‌స్కేప్ గుత్తులు గుత్తులుగా యాపిలు పళ్ళూ, పొగమంచు వెనుక కొండలూ.

చిత్రపటాన్ని సమీపించాడు శిరీష్.

చిత్రపటంమీద రాసివుంది.

'పొగమంచులో నయనానందకరమైన ప్రకృతి.'

డిటెక్టివ్ శిరీష్ ఉలిక్కిపడ్డాడు. చటుక్కున పాంటు

జేబులోంచి వుత్తరం తీశాడు. శోభనాద్రి తన మేనల్లుడు శ్రీకాంత్ కి రాసిన వుత్తరంలో ప్రతి మాటా చదివాడు.

నయనానందకరమైన వాతావరణం.

ఆ వాక్యం వద్ద ఆగిపోయాడు. ఫిబ్రవరి నెలలో విశాఖపట్నంలో పొగమంచు కురుస్తుంది. పొగమంచులో దృశ్యాలు శోభనాద్రికి నయనానందకరంగా కనిపిస్తాయి. ఉదయం నీరెండ వచ్చిన కొద్ది సేపటికి పొగమంచు కరగిపోతుంది.

అయితే పొగమంచులో శ్రీకాంత్ కలుసుకోవలసిన పెద్దమనిషి ఎవరు? ఆ వేళలో తోటలోకి యెవరైనా వస్తారా? అతడు ఎవరు? శ్రీకాంత్ ఎదురుచూస్తోన్న నిధి ఆయనకు ఒప్పగించాడా శోభనాద్రి?

డిటెక్టివ్ శిరీష్ తల విదిలించాడు.

అయితే వుత్తరంలో రాసినట్టు పుట్టినరోజు క్షణాలలో అదృష్టం కలిసిరావడం ఏమిటి?

డామిట్! తాను వుత్తరం చదివి కూడా కప్పదాటు వేశాడు. శ్రీకాంత్ పుట్టిన రోజు క్షణాలగురించి శోభనాద్రి ప్రస్తావించి వుంటాడు.

"శ్రీకాంత్! శ్రీకాంత్!" పిలిచాడు శిరీష్.

శ్రీకాంత్ క్రింద గదిలో దొరికాడు. నేలమట్టంలో వున్న గది అది. గోడవద్ద నిలబడి వున్నారు వామనమూర్తి, శ్రీకాంత్. శ్రీకాంత్ గోడలో చేతితో తడుముతోన్నాడు. అతడి చేతికి నాబ్ తగిలింది. నాబ్ త్రిప్పాడు. గోడలో మనిషి పట్టే స్థలం తప్పుకుంది.

"నేలమాళిగ!" ఆశ్చర్యంగా అన్నాడు శిరీష్.

"అవును సార్! మామూలుగా చూస్తోంటే దీర్ఘ చదరంగా చీలిక కనిపించింది" అన్నాడు వామనమూర్తి.

నేలమాళిగలోకి అడుగు పెడుతూ ఆగాడు శిరీష్. నాబ్ త్రిప్పాడు. గోడలో తప్పుకున్న భాగం మూసుకుంది.

"అదేం సార్! లోపలకు వెళ్ళి చూద్దాం!" అన్నాడు శ్రీకాంత్.

"తప్పకుండా గేటువద్ద ఏదో వాహనం ఆగివుంది. చప్పుడు వినలేదా?" అడిగాడు శిరీష్.

ముగ్గురూ నడవాలోకి వచ్చారు.

గేటు తెరచుకుని రాఘవులు లోపలకు వచ్చాడు. అతడి మో చేతులకు ప్లాస్టర్ అంటించి వుంది. తలకు అమృతాంజనం రాసినట్టు వాసన వస్తోంది. వామనమూర్తి పై గదిలోకి వెళ్లాడు.

"గాయాలు తగిలాయా?" అడిగాడు శిరీష్.

రాఘవులు తలూపాడు. "శ్రీకాంత్ ఆస్తి కాదుగానీ నాకు చెడ్డదినాలు ప్రారంభమయ్యాయి. ఠాకూర్ మనుషులు మళ్ళీ నామీద దౌర్జన్యం చేసి వెళ్లారు, మీ గురించి చెప్పమని."

"ఎందుకు? ఉత్తరం నకలు తీసుకుపోయారు కదా!"

రాఘవులు చిరాకుగా చూశాడు. తనకు ప్రాణగండమయినట్టు తాను చెబుతోన్నాడు. వీళ్ళకు కనీసం సానుభూతి కలగలేదేం?

నేలమట్టంలో వున్న గదిలోని ఫోను మ్రోగింది.

శిరీష్ ఫోన్ ఎత్తి, "రాఘవులుగారూ! మీ కోసం!" అన్నాడు.

రాఘవులు రిసీవర్ లో మాట్లాడి చకచక బయటకు పరుగెత్తాడు. వామనమూర్తి నవ్వుకుంటూ మెట్లు దిగి గదిలోకి వచ్చాడు.

"బాబాయ్ యెక్కడకు వెళ్లావు" అడిగాడు శ్రీకాంత్.

శిరీష్ నవ్వి "మీ బాబాయ్ పైగదిలోంచి క్రింద గదిలోకి ఫోన్ చేశాడు. ఎక్స్‌టెన్షన్ ఫోన్ అని కూడా మరచి రాఘవులు పరుగెత్తాడు" అన్నాడు.

శ్రీకాంత్ అయోమయంగా చూశాడు. "రాఘవులు మనకు చెప్పేవాడు కాదా?"

"రాఘవులు మోసకారి!" అన్నాడు వామనమూర్తి.

ప్రోత్సాహపరిచాడు శిరీష్.

"గంటక్రితం తనని దుండగులు బెదిరించినట్టు చెప్పాడు రాఘవులు. గంటనుండీ అతడు భయంలోంచి తేరుకోలేదు. నమ్మశక్యంగాని విషయం కనీసం కలం మూత కూడా పెట్టుకోలేదు."

"ఆల్‌రైట్! పానకంలో పుడక! శ్రీకాంత్ నీ పుట్టిన రోజు ఏమిటి?" అడిగాడు శిరీష్.

"ఫిబ్రవరి 17."

"ఎన్ని గంటలకు పుట్టావు?"

శ్రీకాంత్ గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు.

"నేను చెప్పగలననుకుంటాను. శ్రీకాంత్ వాళ్ళ నాన్న అంటే మా అన్నయ్య నాచేత జాతకాలు రాయించాడు" వామనమూర్తి తన పాంటు జేబులోంచి చిన్న నోటుబుక్ తీశాడు. "ఫిబ్రవరి 17 ఉదయం 6గం. 1ని॥"

శిరీష్ కళ్ళు మెరిశాయి. మౌనంగా తోటలోకి దారి తీశాడు. తోటలో ఫౌంటెన్ వుంది. ఫౌంటెన్ చుట్టూ రింగ్. రింగ్ మధ్య మెత్తటి మట్టిలో నిమ్మగడ్డి. గాలిలో

సువాసన. ఫౌంటెన్‌కి అవతలగా శిలా విగ్రహం.

శిరీష్ ఫౌంటెన్ దాటి శిలావిగ్రహాన్ని సమీపించాడు. నున్నటి విగ్రహం నల్లగా నిగనిగలాడుతోంది. శిలా విగ్రహం కింద శోభనాద్రిరావు 1861—1907 అని రాసివుంది.

శ్రీకాంత్ మేనమామ శోభనాద్రి. శోభనాద్రి, తాతయ్య ఈ శోభనాద్రిరావు అయి వుండాలి.

వామనమూర్తి, శ్రీకాంత్ లోపలకు వచ్చారు.

"మనం రేపు ఉదయం 6 గంటలకు తోటలో వుండాలి!" అన్నాడు శిరీష్.

5

కోడి కూసింది. ఇంకా చీకట్లు పల్చగా వున్నాయి. డాట్సన్ కారు అమర్ నగర్‌లో బంగళాముందు ఆగింది. హెడ్ లైట్స్ ఆఫ్ చేశాడు శిరీష్.

ముగ్గురూ తోటలోకి నడిచారు.

చీకట్లు మెల్లిగా విచ్చుకుంటున్నాయి. తోటంతా పొగమంచు కురుస్తోంది.

ముగ్గురూ ఫౌంటెన్ వద్ద ఆగారు. శిలా విగ్రహం మంచునీళ్ళతో తడిసివుంది.

డిటెక్టివ్ శిరీష్ తోటలో కలియతిరుగుతున్నాడు. తూర్పు దిశ ఎర్రబడుతోంది. శిరీష్ వాచీ చూసు కున్నాడు.

ఫిబ్రవరి 15 ఉదయం 6గం॥ 5ని॥

శిరీష్ నిట్టూర్చాడు. మరో 12 నిమిషాలలో ఏదో జరుగుతుంది. యెవరో పెద్దమనిషి వస్తాడు. అతను యెవరు? ఎలా వస్తాడు? అతడికి శ్రీకాంత్ యెవరో తెలుసా? ఆ పెద్ద మనిషి మీద శోభనాద్రికి అంత

గు రేమిటి?

శిరీష్ తల విదిలించాడు.

తాను గాలిలో పరిశోధన చేస్తోన్నాడు. యెక్కడా భౌతికమైన ఆధారంలేని పరిశోధన. తాను తప్పటడుగు వేస్తున్నాడు. ఎక్కడ? వెలుగు రేకలు తోటలో అలుము కుంటోన్నాయి.

వాచీలో ముళ్ళు కదులుతోన్నాయి.

శ్రీకాంత్, వామనమూర్తి విడిగా తోటలో తిరుగు తున్నారు. మంచు తెరలు కరుగుతోన్నాయి.

6గం॥—16ని॥

శిరీష్ ఉలిక్కిపడ్డాడు. తోటలో తళుక్కున మెరి సింది.

"ఏమిటా మెరుపు?" అరిచాడు శ్రీకాంత్.

శిరీష్ శిలా విగ్రహం ముందు ఆగాడు. శిలా విగ్రహం మెరుస్తోంది. అదీ కొన్ని క్షణాలపాటే! విగ్రహం మెరవడం ఆగిపోయింది.

'పెద్దమనిషిని కలుసుకో!'

పెద్దమనిషి శోభనాద్రి శిలావిగ్రహం కాదుగదా! తోటలోకి ఈ వేళప్పుడు యెవరు వస్తారు? అయినా ఈ రోజు రారు? శ్రీకాంత్ పుట్టిన రోజు 17 కదా! నిమిషాలు గడుస్తున్నాయి.

"ఒక కోణంలో సూర్యకిరణాలు పడి విగ్రహం మెరుస్తుంది" అన్నాడు శిరీష్.

"అంటే విగ్రహంలో ఏదో మర్మం వున్నదన్న మాట!" అన్నాడు శ్రీకాంత్.

"కాని మీ మేనమామ సూచనల ప్రకారం ఫిబ్రవరి 17న ఈ తోటలో యెవరో పెద్దమనిషిని కలుసుకోవా

లన్నట్టుంది. నిజానికి విగ్రహమేమిటి? మామయ్య దృష్టిలో పెద్దమనిషి!"

"అవును. నాకూ అలాగే అనిపిస్తోంది. ఈ నిర్జనమైన తోటలో ఉదయం 6గం॥—17ని॥కి యెవరు వస్తారు? శోభనాద్రిగారు మనిషిని నమ్మలేదు" వామనమూర్తి కలగజేసుకున్నాడు.

"అయితే మనం 17 వరకూ ఆగాలి!"

"కాని నగరాభివృద్ధి సంస్థ దాన్ని 18న స్వాధీనం చేసుకుంటుంది."

"వాళ్ళు స్వాధీనంలోకి వెళ్తే ఈ ప్రాంతంలో బుల్ డోజర్లు విహారం చేస్తాయి."

"అంటే మనం ఈ లోపుగానే విగ్రహం రహస్యం కనుక్కోవాలి!" ఆలోచనలతో శిరీష్ తలమునకలయ్యాడు. విగ్రహాన్ని సమీపించాడు. దాన్ని చుట్టి వచ్చాడు. విగ్రహం తాకి చూశాడు. యెక్కడా ఎలాంటి నాబ్స్ లేవు. విగ్రహం నిలబడిన పీఠం నున్నగా వుంది. మాయ అరలు లేవు.

ముగ్గురూ విగ్రహంచుట్టూ నేల తడిమారు.

శిరీష్ విగ్రహం పీఠం నేలమీద అన్ని ప్రదేశంలో వ్రేలు పెట్టాడు. అంచునే వ్రేలు నడిపాడు.

"శిరీష్‌గారూ!" అరిచాడు వామనరావు. శిరీష్ అటు నడిచాడు. నేలలో చిన్న రింగు వుంది. రింగులో బొటన వ్రేలు పెట్టి పైకి లాగాడు వామనరావు. రింగులో చలనం లేదు.

శిరీష్ రింగును దొరకబుచ్చుకున్నాడు. గుండ్రంగా తిప్పాడు. యెక్కడో కరకరమంటోంది. రింగు చేతిలో తిరుగుతోంది.

"విగ్రహం కదులుతోంది!" ఆశ్చర్యపోయాడు వామనమూర్తి.

శిరీష్ రింగును తిప్పుతోన్నాడు. పీఠంవద్ద విగ్రహం ప్రక్కకు తప్పుకుంటోంది. విగ్రహం క్రింద చిన్న గొయ్యి.

శిరీష్ రింగు వదిలిపెట్టి గోతిలోకి వంగి చూశాడు.

గోతిలో చిన్న చెక్కపెట్టె వుంది. శిరీష్ చెక్కపెట్టె పైకి తీశాడు. పెట్టె చుట్టూ గోతిలో పౌడర్. గమాక్సిన్ వాసన గుప్పుమంది.

'చెదలు పట్టకుండా!' తలపంకించాడు శిరీష్.

పెట్టె తెరిచాడు. పెట్టెలో చిన్న కాగితం ముక్క వుంది.

"ఇంకా చీకట్లోకి... ఇంకో విగ్రహంలోకి...క్షణాల నీడలలోకి...."

ఇంతే వుంది కాగితంలో.

శ్రీకాంత్ నిట్టూర్చాడు.

"మనది వృథా ప్రయాస!"

"అవును. అలాగే తోస్తోంది!" అన్నాడు వామనమూర్తి.

"మా నాన్న మీద శోభనాద్రి మామయ్యకు కోపం వుంది. అందుకే ఈ రకంగా నామీద కసి తీర్చుకుంటున్నాడు!" అన్నాడు శ్రీకాంత్.

శిరీష్ వాళ్ళ మాటలు వినడం లేదు. చెట్ల వెనుకగా మనుషులు కదులుతోన్నారు. మరు నిమిషంలో వాళ్ళ చుట్టూ మనుషులు.

గళ్ళ లుంగీ గళ్ళ పంచెకట్టు కట్టుకున్న గూండా ఒకడు శిరీష్‌ను సమీపించాడు. రాళ్ళు దొర్లిస్తోన్నట్టు

నవ్వాడు. విలాసంగా చెక్కు పెట్టె అందుకున్నాడు.

శ్రీకాంత్, వామనమూర్తి మొహాలు చూసుకున్నారు.

6

"మనం తప్పుపని చేశాం. ఇప్పటికి వెయ్యి రూపాయిల వరకూ ఖర్చయాయి" అన్నాడు వామనమూర్తి.

"అవును. అసలు కలసివచ్చేది వుందో లేదో...." అన్నాడు శ్రీకాంత్.

"నువు అనవసరంగా డిటెక్టివు అంటూ వెంపర్లాడావు. ఈ ఖర్చులకు తోడు డిటెక్టివు కివ్వవలసిన ఫీజు ఎంత వుంటుందో...."

"మనకు కలసిరాకపోతే ఫీజు యెక్కడనుండి తెస్తాం?"

"ఇవ్వకపోతే బాగుంటుందా?"

"ఇక్కడితో పరిశోధన ఆపివేయమని చెబుదాం!"

హోటలు రూంలో వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"డిటెక్టివ్ విషయం తర్వాత ఆలోచిద్దాం. ముందు ఉదయం కనిపించిన ఉత్తరం విషయం చూడు బాబాయ్!" అన్నాడు శ్రీకాంత్.

"నీకు యింకా కలసివస్తుందన్న నమ్మకం వుందన్న మాట!" నవ్వాడు వామనమూర్తి.

"కొంత ఆశ వుంది. కొంత అపనమ్మకం వుంది."

"ఇంకా చీకట్లోకి....ఇంకో విగ్రహంలోకి....ఋణాల నీడలలోకి....అని వుంది చీటీలో. అంటే...."

"నిన్న మనం నేలమాళిగ చూశాం. చీకటి నేలమాళిగ.... నేలమాళిగలో ఇంకో విగ్రహం వుండివుండవచ్చును."

"క్షణాల నీడలలోకి....అంటే మనం అన్వయించుకో లేదు."

"ముందు ఈ చీకటి ఏమిటో చూద్దాం. తర్వాత క్షణాల నీడలు....పద...."

"ఠాకూర్ మనని వెంటాడుతాడేమో. నిన్న లాయరు చెప్పితే మనం నమ్మలేదు. ఇవాళ ప్రత్యక్షంగా చూశాము."

అవును అదో ప్రమాదం వుంది....

వామనమూర్తి కిటికీలోంచి బయటకు చూశాడు. క్రింద రోడ్డుమీద జనం అటూ ఇటూ కదులుతోన్నారు.

"యెవరూ మన గదిమీద నిఘా లేరు" అన్నాడు వామనమూర్తి.

శ్రీకాంత్ ఉల్లాసంగా చూశాడు.

ఇద్దరూ గదులకు తాళం పెట్టి రోడ్డుమీదకువచ్చారు. టాక్సీ మాట్లాడుకున్నారు. టాక్సీ అమర్ నగర్‌లో ఆగింది. టాక్సీ నడుస్తోన్నంత సేపూ ఇద్దరూ తమను ఎవరూ వెంటాడటం లేదని నిశ్చయించుకున్నారు.

శోభనాద్రి బంగళాముందు ఆగింది టాక్సీ.

ఇద్దరూ బంగళాలో ప్రవేశించారు, ఇల్లు ప్రశాంతంగా వుంది. ఇద్దరూ కింద గదిలో చేరారు. నేల మాళిగకు పోయే రహస్య ద్వారం తెరిచారు. రహస్య ద్వారం లోంచి కిందకు మెట్లు కనిపించాయి. చెక్క మెట్లు. చెక్క మెట్లు దిగారు యిద్దరూ. నడవా చీకటిగా వుంది. పెన్ టార్చి తీశాడు. వెలుగురేఖలో వామనమూర్తి చుట్టూ చూస్తూ నడవసాగాడు.

నడవా చివర చిన్న కొట్టు గది వుంది. గదికి తలుపులు లేవు. గదిలోకి చూశారు ఇద్దరూ. మసకచీకట్లో

ఎంతోమంది కూర్చున్నట్టు కనిపించారు.

ఇద్దరూ వులిక్కిపడ్డారు.

శ్రీకాంత్ గుండె దిటవుచేసుకొని పెన్ టార్చి అటు త్రిప్పాడు.

గదిలో విగ్రహాలున్నాయి. దేశభక్తుల విగ్రహాలు! అన్నీ సిమెంట్ విగ్రహాలు. విగ్రహాల మధ్య మరో విగ్రహం పట్టే ఖాళీసలం వుంది.

"శోభనాద్రి దేశభక్తుడా?" అడిగాడు వామనమూర్తి.

"అనే అనుకుంటాను! కాని ఇక్కడ మరో విగ్రహం వుండాలి! లేదు" వామనమూర్తి నేలను పరీక్షగా చూశాడు.

నేలమీద దుమ్ము ధూళి పడివుంది.

పెన్ టార్చి వెలుగు విగ్రహాలమధ్య ఖాళీసలంమీద పడింది. ధూళిలో ఏదో రాసివుంది. టార్చి వెలుగులో యిద్దరూ చదివారు.

"ప్రీతం స్టోర్స్, విశాఖపట్నం—2" శ్రీకాంత్ ఈల వేశాడు. యెవరో వ్రేలితో రాసిన అక్షరాలు. శ్రీకాంత్ కాగితంమీద నోట్ చేసుకున్నాడు. బయటకు కదిలారు.

ఇద్దరూ నడవాలో నడిచారు. చెక్క మెట్లు సమీపించారు. వెలుగు కనిపిస్తోంది గుమ్మంలోంచి. వెలుగుకు నీడ అడ్డం వచ్చింది. ముందు నడుస్తోన్న శ్రీకాంత్ వులిక్కిపడ్డాడు.

నీడ ఎవరిదో చప్పున గుర్తించాడు.

ఠాకూర్!

శ్రీకాంత్ ఆగిపోయాడు. వామనమూర్తి అప్పటికే దడదడలాడుతోన్నాడు.

ఠాకూర్ చెక్క మెట్లు దిగాడు.

"రండిరా బచ్చాల్లారా! మీరు యిక్కడుంటారని తెలుసు!" రాళ్ళు దొరిస్తోన్నట్టు నవ్వాడు ఠాకూర్.

"విగ్రహం దొరకలేదు!" అన్నాడు శ్రీకాంత్ వణికి పోతూ.

"విగ్రహంలేదని మాకూ తెలుసు!"

"అయితే...."

"మాకు తెలియని రహస్యం మీకు తెలిసివుండవచ్చు."

"రహస్యమా? మాకేం తెలియదు!"

ఠాకూర్ అతడిని అంది పుచ్చుకున్నాడు.

"బయట నా మనుషులున్నారు. వాళ్ళకు నిన్ను ఒప్పచెబుతాను. ఫుట్ బాల్ ఆడతారు తెలుసా?" శ్రీకాంత్ ను చెంపమీద చెళ్ళుమని కొట్టాడు.

శ్రీకాంత్ కి కళ్ళూ, కళ్ళలో నీళ్ళూ తిరిగాయి. వామన మూర్తి ఠాకూర్ ను సమీపించాడు.

"విగ్రహం లేదు. కానీ ధూళిలో ప్రీతం స్టోర్స విశాఖపట్నం-2 అని రాసివుంది. అంతే!" భయపడుతూ అన్నాడు.

ఠాకూర్ కళ్ళు కుటిలంగా మెరిశాయి.

ఇద్దరినీ చెరొక భుజమూ పట్టుకుని బయటకు లాక్కుంటూ వచ్చాడు.

నడవలో ఆగాడు.

"హాండ్సప్!" స్తంభం చాటునుండి వచ్చాడు శిరీష్.

ఠాకూర్ కళ్ళు క్రూరంగా చూస్తున్నాయి.

శిరీష్ అతడి కళ్ళలో కదలికను గమనించాడు. తన చేతిలో పిస్తోలు వుంది. ఠాకూర్ కి అటూ యిటూ వామన మూర్తి శ్రీకాంత్ వున్నారు. ఠాకూర్ వాళ్ళను తన

కవచంగా ఉపయోగించుకుంటాడు.

శిరీష్ క్షణాలు వృథా పోనివ్వదల్చుకోలేదు. గాల్లోకి దూకాడు. నరాల శక్తి పాదాలలో కేంద్రీకరించుకున్నాడు. ఠాకూర్‌ను తన్నాడు. వెల్లకితలా పడబోతూ బోర్లగిల తిరిగాడు. చేతులమీద నేలను ఆనాడు.

ఠాకూర్ గోడకి కొట్టుకున్నాడు. వామనమూర్తినీ శ్రీకాంత్‌నూ వదిలాడు.

శిరీష్ అతడికి అవకాశం యివ్వదల్చుకోలేదు. బోర్లగిల పడినవాడు అదే కోణంలో ముందుకు దూకాడు.

ఠాకూర్ అతడి భుజాలు పట్టుకున్నాడు. అతడి చేతిలోని పిస్తోలును తన్నాడు.

శిరీష్ కళ్ళ కొసలలోంచి ప్రక్కకు చూశాడు.

శ్రీకాంత్ పిస్తోలు అందుకున్నాడు.

దూరంగా వాహనం వస్తోన్న చప్పుడయింది.

శిరీష్ అరిచాడు. "పారిపోండి. వీళ్ళు నన్నేమీ చేయరు!"

శిరీష్‌కి పిస్తోలు అందించలేదు శ్రీకాంత్. అలాగని పిస్తోలు ప్రేల్చనూలేదు. పిస్తోలు జేబులో పెట్టుకుని గేటులోకి ఉరికాడు. వామనమూర్తి అప్పటికే రోడ్డు మీద వున్నాడు.

"ఠాకూర్ మనుషులు నిజంగా అతడివెంట రాలేదు. అదిగో — వాన్‌లో వస్తోన్నారు" అన్నాడు వామనమూర్తి రొప్పుతూ.

ఇద్దరూ రోడ్డుమీద పరుగెత్తి మాయమయారు.

వాన్ గేటుముందు ఆగింది. ఠాకూర్ మనుషులు క్రిందకు ఉరికారు. అప్పటికి శిరీష్‌ను కదలకుండా పట్టుకున్నాడు ఠాకూర్.

ఠాకూర్‌ను సమీపించారు ఠాకూర్ అనుచరులు.

ఠాకూర్ తన పట్టులో వున్న శిరీష్‌ను నడిపించసాగాడు. తన అనుచరులలో ఒకడిని పిలిచాడు.

"రాం! ప్రీతం స్టోర్స్‌కి వెళ్ళు! శోభనాద్రి విగ్రహం వుంటుంది. చేజిక్కించుకో" అన్నాడు ఠాకూర్.

రాం బయటకు పరుగెత్తాడు.

శిరీష్‌ను కుర్చీలో కూర్చుండబెట్టి తాళ్ళతో కట్టేశారు.

"నిన్ను ఏమీ చేయనని నీ ధీమా ఏమిటి?" అడిగాడు ఠాకూర్.

శిరీష్ నవ్వి, "నువ్వూ నీ అనుచరులూ, నేనూ నా క్లయంట్సూ వెతికేది ఒకే గమ్యం కోసం! అందుకే...." అన్నాడు.

వాళ్ళు దొరికిపోయినట్టు నవ్వాడు ఠాకూర్.

"వాళ్ళు యింకా నీ క్లయింట్స్ ఏమిటి? నీ ప్రమేయం లేకుండానే వాళ్ళు అండర్ గ్రవుండ్‌లో వెతుక్కోవడానికి వచ్చారు."

శిరీష్ బయటపడదల్చుకోలేదు. తనకీ క్లయింట్స్‌కీ మధ్యలో ఠాకూర్ ఎవడు?

ఉన్నట్టుండి శిరీష్ నవ్వసాగాడు.

"పెద్ద పెద్ద హత్యలు చేశానంటావ్ .... ఉత్తర ప్రదేశ్‌లో గొప్ప దోపిడీదారునంటావ్. నీకు తలలో తెలివిలేదు!"

ఠాకూర్ మొహం ఎర్రబడింది.

"యెవరితో మాట్లాడుతున్నావో మరిచిపోయావు?" అరిచాడు ఠాకూర్.

శిరీష్ పరిహాసంగా నవ్వాడు.

ఠాకూర్ కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఒరేయ్ సూదులూ, క్రొవ్వొత్తి. అగ్గి పెట్టె" అరిచాడు ఠాకూర్.

అనుచరులు స్టూలుమీద క్రొవ్వొత్తి నిలబెట్టారు. ఒత్తి ముట్టించారు. సూదుల చివర చిన్న తాయ్య పిడులు!

సూదులు కాల్చసాగారు.

శరీఫ్ వాటివంక చూడసాగాడు.

7

ప్రీతం స్టోర్స్ముందు ఆగింది ఆటో.

శ్రీకాంత్ బాడుగ చెల్లించి ఆటోను పంపేశాడు. వామనమూర్తి రోడ్డుమీదకు పరిశీలించి చూసి స్టోర్స్ వైపు నడిచాడు.

శ్రీకాంత్ కౌంటర్ ముందు ఆగాడు.

"మీవద్ద విగ్రహాలున్నాయా?" అడిగాడు శ్రీకాంత్.

"ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలా? యెంత ఖరీదులో కావాలి?" అన్నాడు స్టోర్స్ మేనేజర్.

"ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవి కావు..సిమెంట్‌తో చేసినవి...."

మేనేజర్ విడ్డూరంగా చూశాడు. "మా స్టోర్స్‌లో సిమెంట్ విగ్రహాలు అమ్ముతారని యెవరు చెప్పారు?"

"శోభనాద్రిగారు."

మేనేజర్ ఉలిక్కిపడ్డాడు. "మీరెవరు?"

శ్రీకాంత్ అటూ ఇటూ చూశాడు. పెదిమలు కదప బోయాడు. వామనమూర్తి అతడి చేతిని గట్టిగా నొక్కాడు. స్టోర్స్ ముందు టాక్సీ ఆగడం, దాంట్లోంచి రాం దూకడం శ్రీకాంత్ చూడలేదు. కాని వామనమూర్తి చూడగలిగాడు.

స్టోర్స్‌లోకి వచ్చాడు రాం. అతడి చేతిలో చాకు

తటుక్కుమన్నది. చాకును శ్రీకాంత్ వీపుమీద ఆన్చాడు.

"నువు మాట్లాడుతోన్న విగ్రహం విషయం నాకు తెలుసు! ప్రాణాలకు ముప్పు తెచ్చుకోనక! విగ్రహం నాకు యిప్పించు" ఆదేశించాడు రాం.

శ్రీకాంత్ కొన్ని క్షణాలపాటు దిగ్భ్రాంతిలో మునిగిపోయాడు.

వామనమూర్తి షాపు మేనేజర్ మొహంలోకి చూశాడు.

అతడిని శోభనాద్రి నమ్మాడు. కాబట్టే విగ్రహం ఈ స్టోర్స్‌లో వుంచాడు. స్టోర్స్‌లో సిమెంట్ విగ్రహాలు అమ్మరు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే అమ్ముతారు. శోభనాద్రిగారు వుంచిన విగ్రహం శ్రీకాంత్‌కి సంక్రమించవలసి వుంది. అంటే మరెవరైనా దాన్ని సంగ్రహించాలంటే అటువంటి నకిలీ విగ్రహం వుంచుతారు.

తెల్లబోయి చూస్తోన్నాడు మేనేజర్. అతడికి కన్ను గొట్టాడు వామనమూర్తి. మేనేజర్‌కి ధైర్యం వచ్చింది. చెయ్యి చాపి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలవైపు చూపించాడు. రకరకాల సైజులలో విగ్రహాలున్నాయి.

రాం వాటివంక నిర్ఘాంతపోయి చూశాడు. కొంతసేపట్లో వాటిలో వున్న శోభనాద్రి విగ్రహం కనిపించింది. చటుక్కున దాన్ని అందుకుని బయటకు పరుగెత్తాడు.

"దానికి నేను బిల్లు చెల్లిస్తాను!" అన్నాడు శ్రీకాంత్.

"అక్కరలేదు. ముందు మీరు శోభనాద్రిగారికి ఏమవుతారో చెప్పండి!"

"ఆయన మా మామయ్య."

"లోపలకు రండి. విగ్రహం యిస్తాను" అన్నాడు

స్టోర్స్ మేనేజర్. ముగ్గురూ లోపలకు వెళ్లారు....
సిమెంట్ విగ్రహం స్టూలుమీద వుంది. తోటలో ఉన్న విగ్రహం మోడల్ లో వుంది.

"తీసుకువెళ్ళండి. మీ గురువు నాకు శోభనాద్రిగారు చెప్పారు" అన్నాడు మేనేజర్.

శ్రీకాంత్, వామనమూర్తి విగ్రహంతో బయటకు నడిచారు.

8

"సార్! రాం వస్తోన్నాడు. అతడి చేతిలో విగ్రహం వుంది!" అన్నాడు అనుచరుడొకడు.

ఠాకూర్ సూదులు పట్టుకున్నవాడల్లా వెనక్కు తిరిగాడు. సూదులు స్టూలుమీద పెట్టాడు.

విగ్రహంతో రాం గదిలోకి వచ్చాడు.

శిరీష్ రాంనూ రాం చేతిలో ఉన్న విగ్రహాన్ని చూశాడు. నుదురు చిట్లించాడు.

రాం విగ్రహాన్ని కుర్చీలో పెట్టాడు. ఠాకూర్ విగ్రహాన్ని చుట్టూ తడిమాడు. విగ్రహం నున్నగా తీర్చి దిద్దివుంది. సుత్తిని అందుకుని విగ్రహం నెత్తిన ఒక పెట్టు పెట్టాడు. విగ్రహం తునాతునకలయి కుర్చీలో పడింది. ముక్కల మధ్య రాగిరేకు.

ఠాకూర్ రాగిరేకును అందుకున్నాడు. దానిమీద అక్షరాలూ అంకెలూ తాపడం చేసి ఉన్నాయి. జి.డబ్ల్యు.బి.(G.W.B.)బొంబాయి. 19-8-1-4-15-23.

ఠాకూర్ తల విదిలించాడు. శిరీష్‌ను సమీపించాడు.

"నిన్ను హింసించలేదు కదా! ఒక్క మాట చెప్పు!" స్నేహంగా అడిగాడు ఠాకూర్.

"ఏమిటది?"

"జి. డబ్ల్యు. బి. అంటే ఏమిటి?"

శిరీష్ ఠక్కున చెప్పాడు. "గుడ్ విల్ బాంకు"

ఠాకూర్ మెల్లగా రేకును కదిపి, "నిజమే! లక్నోలో కూడా దాని బ్రాంచి వుంది. నేను దోచుకున్నాను కూడా" అన్నాడు.

"కింద నెంబర్లేమి?" అడిగాడు శిరీష్.

ఠాకూర్ రాళ్ళు దొర్లిస్తోన్నట్టు నవ్వాడు. "శోభనాద్రి గుడ్ విల్ బాంకు లాకర్‌లో సొమ్ము దాచాడు. దాని తాళం తెరుచుకునే కోడ్ అంకెలు!" అన్నాడు.

"ఠాకూర్! అభినందనలు. చివరకు నువ్వే నెగ్గావు!"

"థాంక్స్! కాని.... ఈ క్లూ తప్పుకాదనే నమ్ముతాను. యెందుకయినా మంచిది. నా అనుచరులు యిక్కడ నిఘా ఉంటారు."

శిరీష్ నవ్వి, "వాళ్ళకు వాటా యివ్వకుండా తప్పించుకుంటావన్నమాట!" అన్నాడు.

ఠాకూర్ మొహంలో దిగ్భ్రాంతి క్షణకాలం కనిపించి మాయమయింది.

ఠాకూర్ తన అనుచరుల్లో ఒకడికి సైగ చేశాడు.

వాడు సిరంజిలోకి ద్రవంలాగి శిరీష్‌ను సమీపించాడు.

9

డిటెక్టివ్ శిరీష్ కళ్ళు తెరిచాడు. గదిలో తానొక్కడే కూర్చున్నాడు. గది తలుపులు వెలుపలనుండి మూసి ఉన్నాయి. స్టూలుమీద యింకా కొవ్వొత్తి, అగ్గిపెట్టె, సూదులూ వున్నాయి.

ఠాకూర్ తన బృందంతో కంగారుగా వెళ్ళిపోయాడు.

అతడు త్వరగా బొంబాయి చేరుకోవాలి. అందుకే ఆ హడావుడి.

శిరీష్ మందహాసం చేశాడు. తనకు మత్తుమందు ఇంజెక్ట్ చేశారు.

శిరీష్ కళ్లు తిప్పి వాచీవంక చూసుకున్నాడు. మూడు గంటలయింది. బయట చీకటిగా ఉన్నట్టు కిటికీలోంచి తెలుస్తోంది. అంటే తెల్లవారుజాము మూడు గంట అయిందన్నమాట. కాళ్ళూ చేతులూ కదిపాడు శిరీష్. మత్తుమందు ఇంజక్ట్ చేయడంవల్లనే వాళ్ళు తన తాళ్ళు విప్పారు.

కుర్చీలోంచి లేచాడు శిరీష్. కొవ్వొత్తి వెలిగించాడు. తలుపు వద్ద జ్వాల ఉంచాడు. తలుపు కొద్దిసేపట్లోనే అంటుకుంది. రెండు రెక్కలూ మండసాగాయి. పొగ గదిలో వ్యాపిస్తోంది. కిటికీలోంచి వచ్చేగాలి చాలడం లేదు.

శిరీష్ ఉక్కిరిబిక్కిరయ్యాడు. కాలుతోన్న తలుపులను బలంగా తన్నాడు. తలుపులు పెళపెళ విరిగి అవతలకు పడ్డాయి. గచ్చుమీద పడి మండుతోన్నాయి. శిరీష్ కుర్చీని వెలుగు దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు. మస్తిష్కంలో ఆలోచనలు రేగుతున్నాయి.

శోభనాద్రి నిజంగా గుడ్ విల్ బాంకులో తన సంపద దాచాడా? దాచి వుంచినవాడు లాకర్ నెంబర్లు ఇవ్వడం ఏమిటీ? అటువంటప్పుడు ఉత్తరం యెందుకు రాసినట్టు? బాంకు పాస్ బుక్ పంపించవచ్చునుకదా! ఉత్తరంలో 'పుట్టినరోజు క్షణాల' గురించి ఉదహరించాడు శోభనాద్రి. వాటికి అర్థం ఏమిటి?

రెండో ఉత్తరంలో 'క్షణాల నీడలు' ఏమిటి?

లాకర్ నెంబర్లు మననం చేసుకున్నాడు శిరీష్.

19—8—1—4—15—23.

అంకెలను కాగితంమీద వేసి కుస్తీపట్టసాగాడు. తూర్పు తెల్లవారుతోంది. వెలుగురేఖలకు చీకట్లు పారి పోతున్నాయి.

శిరీష్ చకచక కాగితం మీద ఇంగ్లీ అక్షరాలు రాశాడు. A నుండి Z వరకూ ఒకటినుండి ఇరవై ఆరు నెంబర్లు వేశాడు. తిరిగి Z నుండి A వరకూ వెనక్కి అంకెలు వేసుకుంటూ ఒకటినుండి ఇరవై ఆరు వేశాడు. రెండు ఇంగ్లీషులు స్పెల్లింగులు తయారయాయి. వాటిలో మొదటి స్పెల్లింగ్ అర్థవంతంగా వుంది.

SHADOW (షాడో—)

నీడ! ఏ నీడ! విగ్రహంలో నీడ గురించి ప్రస్తావన ఏమిటి?

"శిరీష్‌గారూ!"

శిరీష్ తలెత్తి చూశాడు. శ్రీకాంత్, వామనమూర్తి విగ్రహంతో తిరిగొచ్చారు. ఆ సిమెంట్ విగ్రహంమీద కూడా 19—8—1—4—15—23 అని అంకెలు వున్నాయి! దానిపై GWB మాత్రంలేదు. విగ్రహాన్ని పగలగొట్టి చూశారు. మరే ఆధారమూ దొరకలేదు.

శిరీష్ కుర్చీలోంచి దిగ్గున తోటలోకి పరుగెత్తాడు. తూర్పు ఎర్రబడుతోంది. తోటలో చెట్ల నీడలు ఏర్పడుతున్నాయి.

తోటలో శోభనాద్రి తాతయ్య విగ్రహం యథా ప్రకారంగా వుంది. 'ఎండ తగిలే వీలు బాగా వుంది' గొణిగాడు శిరీష్.

' సూర్యకిరణాలు విగ్రహంమీద పడ్డాయి. విగ్రహం నీడ పొడవుగా పడుతోంది.

శిరీష్ వాచీ చూసుకున్నాను. 6 గం॥ 4 ని॥

విగ్రహం నీడ చివరకు పరుగెత్తాడు. నీడ మెల్లగా విగ్రహంవైపుగా కుంచించుకుంటోంది. వాచీ చూసుకుంటూ మెల్లగా నీడ వెంబడే నడవసాగాడు. నిముషాలు గడుస్తోన్నాయి. నేలమీద సిమెంట్ చప్టా. అడుగు వెడల్పు చప్టా. 6గం॥ 16ని॥ విగ్రహం కొన్ని క్షణాల పాటు మెరిసింది.

శ్రీకాంత్, వామనమూర్తి అతడి ప్రతి చర్యనూ విడ్డూరంగా చూస్తోన్నారు.

6గం॥ 17ని॥

నీడను చూశాడు. మరుక్షణం నీడ అంచులో గుర్తు పెట్టాడు. అక్కడ త్రవ్వమని చెప్పాడు. శ్రీకాంత్, వామనమూర్తి పారలు అందుకున్నారు.

ఈ రోజు ఫిబ్రవరి 17. ఈ రాత్రిలోగా ఆస్తి దొరికితే దొరికినట్టు! రేపు అంటే ఫిబ్రవరి 13న ఈ భవనం డిమాలిష్ అవుతుంది.

నేలలో నిధులున్నా నిక్షేపాలున్నా అంతా మనిషి కంటపడకుండా అణగారి పోతాయి.

ఇద్దరూ త్రవ్వసాగారు. చేతులు చెమటలు పడుతున్నాయి, అలవాటులేని పని కావటంవలన.

ఎక్కడో ఠాణాలో ఏడు గంటలు కొట్టారు.

గునపం ఖంగుమన్నది.

ఇద్దరూ లేని ఓపిక తెచ్చుకొని త్రవ్వుతోన్నారు. లంకెబిందెలు బయటపడ్డాయి. ఇద్దరూ అతికష్టంమీద వాటిని గోతిలోంచి బయటకు తీశారు.

డిటెక్టివ్ శిరీష్ తృప్తిగా నిట్టూర్చాడు.

—: ఐ పో యిం ది :—